

# చెలగాటం

తానెంత సరసుడో, సమర్థుడో, స్నేహశీలియో, వెల్ విషరో, ఉద్ధరించే స్వభావము గలవాడో పరంధామ్, అహహా అని నవ్వుతూ చెప్పుకెళ్తుంటే, పినాకికి నవ్వు రాలేదు సరిగదా విచారం గలిగింది. పరంధామ్ పినాకిని గమనించ లేదు. చేతులో పేకముక్కలు సద్దుకుంటున్నాడు.

''పరంధామ్! నిప్పుతో చెలగాటమాడుతున్నావ్ సుమా'' అని హెచ్చరించాడు.

బల్ల ముందున్నది యిద్దరే. అయినా మరో నలుగురు మిత్రులొచ్చి, కుర్చీలాక్రమించారు. పరంధామ్ మరో ప్యాకెట్‌లోని ముక్కలు తీసి కలిపి షఫుల్ చేసి అందరికీ పంచాడు.

''గూఢంగా చెపితే నా పేద బుర్ర కర్థం గాదు. పినాకీ! బి ప్లెయిన్ అండ్ ఫ్రాంక్'' అన్నాడు పరంధామ్. అతనికి తెలుగు యింగ్లీషూ కలిపి మాట్లాడటం అలవాటు. దక్షిణాన కొన్నాళ్ళు ప్రైవేట్ రంగంలో పని చేశాడు. అందుకని అరవ పదాలూ నవ్వు వచ్చేట్టు దొర్లిస్తాడు.

''నవ్వులల్లా నువ్వులవుతుందంటున్నా. ఇంకా బ్లంట్‌గా చెపితే తుళ్లలవుతుంది అని హెచ్చరిస్తున్నా. హాస్యమని అనుకుంటున్నావు గాని అది గేలి చేయటమే. నవ్వు నాలుగందాల నష్టమంటారు పెద్దలు''. ఆట కానిస్తూనే మరికొన్ని డైలాగులు వల్లించారిద్దరూ. మిత్రులకు అర్థంగాలేదు. గోపరాజు మంచి ట్యూటర్. దాని మీదా చాలా సంపాదన వస్తుంది. ''యేమంటాడు పరం? వాడి తరహా స్టైలూ తెలిసిందేగా పినాకీ? వాడి హృదయం వెన్న గదూ ద్రోహ చింతే లేదు పరంధామ్‌కి. నీతులు, సామెతలూ దొర్లిస్తున్నావు. యేమిటి విశేషం పినాకీ?''

''వ్యాఖ్యానం వేరు. తిట్టటం వేరు. ప్రాపగండా చేసుకోవటానికి నేర్పుండాలి. ప్రత్యర్థిని తూర్పారబడితే యెన్నికల్లో గెలుపు వరిస్తుందా? అది

సంకుచితస్వభావమని వెల్లడౌతుంది. నా చిన్నతనంలో, లోపాలున్నవారిని చూసి నవ్వితే మా అమ్మ నన్ను ''చెంపలేసుకో'' అనేది. చెముడు, మెల్ల, కుంటి, పిచ్చి యేదైనా సరే, చూసి నవ్వగానే అలా అనేది.

''యెవర్ని చూసి నవ్వాడూ పరంధామ్? యెవర్ని గేలిచేశాడూ? చెప్పు మిత్రమా. హితోపదేశం చదివావా?'' అన్నాడు రామనాథ మందుల షాపు యజమాని.

''బాగా అన్నావు రామం. హితోపదేశంలో శకుంతల కథ వున్నది. తన కోర్కె తీర్చుకు వచ్చేసిన రాజు వచ్చి తీసికెళ్లకపోగా తానే సాహసించి వస్తే, నిండు సభలో యెరగనంటున్న రాజు దుష్యంతునితో వాదిస్తూ, యే లాయరు సాయం లేకుండానే, సమర్థించుకుంటూ హితము చెప్పింది'' అన్నాడు పినాకి, సెట్టుకుదురుతున్నదతనికి.

''హితమెలా చెప్పింది శకుంతల? రాజు విన్నాడూ?'' గోపాలం సూపర్‌బజార్ రన్ చేస్తున్న దిట్ట అడిగాడు.

''నీవు చదివినట్టు లేదే హితోపదేశం? తెలియదా?'' పినాకి తన టరన్ రాగానే సెట్ బల్ల మీదుంచేశాడు.

తక్కిన వారంతా సిగరెట్లు యాష్ ట్రే, ముక్కలు బల్ల మీదుంచి లెక్కించారు. కౌంటర్ కాయిన్సు పంచుకున్నారు. వెళ్లబోయే ముందు నిజం రొక్కం బల్ల మీదుంచుతారు. రాత్రి యెనిమిది కావస్తున్నది.

ఫడ్‌లైట్స్ కాంతిలో, టెన్నిస్ కోర్టులో ఆటగాళ్లు టెన్నిస్ ఆడుతున్నారు. బంతి దూరంగా పోయినా, నేలకి తాకి కిందపడినా, బోయ్ తెచ్చి అందిస్తున్నాడు.

''నేనా పుస్తకం చదవలేదు పినాకీ! నా కోసం చెప్పు. నేను, అభిజ్ఞాన శాకుంతలం, శృంగార శాకుంతలం చదివానంతే. హిందీ సినిమా చూశాను. రాజు విన్నట్టు లేదు. శకుంతల రోషపడి సభ విడిచింది. అయిదేళ్ల తర్వాత రాజు బుర్ర గోక్కుంటూ వెళ్లి మరీచాశ్రమం నించి భార్యనూ కొడుకు సర్వదమనునీ, ముని

ఆశీస్సులతో తెచ్చుకున్నాడు. హితము చెప్పిన శకుంతల సభలో గెలిచిందా? వయస్సు తక్కువా. డబ్బున్నదీ గాదు పిల్ల'' అని సిగరెట్ పీలుస్తూ, తన వంతు వచ్చిందని పేకంతా కలిపి షఫుల్ చేసి బల్ల మీదుంచాడు మారుతీరావు. పక్కవాడు కోయగానే అందుకుని నేర్పుగా వేగంగా పంచుతున్నాడు.

మరో యిద్దరు క్లబ్ మెంబర్సు వచ్చి కుర్చీ లాక్రమించారు. వాళ్లకూ పంచాడు మారుతీరావు. హుషారుగా సెంటెడ్ ఫిల్టర్ సిగరెట్లు తగలేస్తూ, దేనిమీద మాట్లాడుతున్నారో వింటూ గ్రహించాలని చూస్తున్నారు. ఫ్యాన్ చల్లని సాఫ్ట్ డ్రింక్స్ తెచ్చి అందించాడు.

''రాజా! రాజువై, న్యాయమూర్తివై, న్యాయపీఠం అలంకరించి మాట తప్పుతున్నావే? తెలియదంటున్నావు. రాణివై అధికారం సంపాయించాలనీ, రాజ్యమేలాలని నా పన్నాగమంటున్నావు. ఒక రాజును మరొక రాజు వంచించవచ్చు. యేమరుపాటుగా వుండగా పొంచివుండి దాడి చేసి రాజుని చంపి తాను ఆ రాజపీఠం ఆక్రమించవచ్చు. గర్భవతినై పనిపెట్టుకునెందుకు వస్తాను? నీకు భార్యాబిడ్డలు లేరని నమ్మబలికావు. అదీ కల్పనేనా? నీ అంత గొప్ప బిడ్డ పుట్టి పెరిగి నీకానందమివ్వాలని తాపత్రయ పడుతుంటే, నీకా గ్రహింపు లేదే? పారాడే పసిబాలుడు నీ కాళ్లకు చుట్టుకుని నవ్వు మొహంతో నీ వంక చూస్తే నీ గుండెలెలా చల్లబడతాయో వూహించవా? తప్పటడుగులేస్తూ, జిలిబిలి పలుకులతో పాలబుగ్గలతో వచ్చే కొడుకు నెత్తుకుని ముద్దు చేస్తే హృదయం ఆనందంతో యెలా పొంగుతుందో తెలుసుకోవా? రాచ విద్యలు నేర్చి పాటవం చూపుతూ, నిన్ను మెప్పించాలని చూసే బాలుని అమాయక మొహం చూస్తే, యీ ప్రపంచం మరింత సుందరంగా కనబడుతుంది. యుద్ధాల్లో పాల్గొంటే అంత సుందరంగా కనబడుతుందా? కుట్రపన్ని రాజ్యమాక్రమించవచ్చు. గర్భవతినయే రావాలా? ఆశ్రమంలో పెరిగాననీ నా వెంట యేమీ రాదనీ నీకు చిన్నతనంగా తోస్తున్నదేమో. మహర్షి పెంచాడు నన్ను. అధర్మ ప్రవర్తనా, ద్రోహ చింతా, రాజునవమానించటం నేర్పుతాడా? నేడు నేను తిరస్కరించబడి

వెళ్లిపోయినా, నా కోసం నీ కొడుకోసం వెతుకుతూ రావాల్సివస్తుంది రాజా. దైవమలాటి పరిస్థితులు కల్పిస్తాడు. నా వల్ల దోషమేదీ? తప్పిదమేదీ? ఆశ్రమవాసులూ మహర్షీ గూడా దోషులే నందామా? అనగలవా? అదే నా రాజలక్షణం?'' అలా అంటూ వరుసగా రాజు తనతో గడిపిన దినాలు వర్ణిస్తూ, ఆయన మాటలూ చేతలూ, తానెవరైందీ చెప్పటం బీరు పోకుండా చెప్పుకెళ్లింది శకుంతల. చిత్రం చూస్తున్నట్టనిపించింది సభికులకి. శకుంతలనే నమ్మారు సభాసదులు. రాజుకి మతిబోయిందో భయపడుతున్నాడో, సంశయిస్తున్నాడో కనిబెట్టలేక నిశ్శబ్దంగా వున్నారు. అశరీరవాణి పెద్దగా చెప్పటం వినిపించింది. ''దుష్యంత మహారాజా! ఈమె కణ్వ మహర్షి పెంపుడు కూతురు. నీవీమెను గాంధర్వ వివాహం చేసుకున్నావు. మహర్షి, తోటి మహర్షులు పిలుచుకెళ్తే వెళ్లాడు. ఆ సమయంలో లేడాశ్రమంలో. ఆయన తిరిగి వచ్చాక మహర్షి అనుమతితో ఆశీస్సులతో నిన్ను నా వెంట తీసికెళ్తానని మాటి యిచ్చి వచ్చావు. నీవు వచ్చే నాటికే శకుంతల గర్భవతి అని తెలిసి కూడా వెళ్లి తెచ్చుకోలేదు. మహర్షి వచ్చి అంతా తెలుసుకుని ''రాజకుమారుడు, రాజాంతఃపురంలోనే జన్మించాలని శకుంతలను తోడు యిచ్చి పంపాడు. వారినీ అవమానించి పంపేశావు. ఒక్కతే నిండు సభలో నీ యెదుట నిలబడిపోయింది. నీవు ధర్మం తప్ప రాదు. శకుంతలను ఆదరించి గౌరవించాలి. ధర్మమేవ జయతే'' అని వినిపించింది.

రాజు తెలివినబడి సభాసదులంతా దుయ్యబట్టక ముందే, సింహాసనం దిగి వచ్చి, శకుంతల తన భార్య అని సభలో ఒప్పుకుని అంతఃపురంలోకి తీసికెళ్లాడు. ముక్క బల్లమీద పడేస్తూ ముగించాడు పినాకి.

రాములనే ప్రకృతి వైద్యుడూ మరియు రోలర్ స్కేటింగ్ కోచ్ అన్నాడు. ''కంసునికి వార్నింగిచ్చిందీ అశరీరవాణేనని చదివాను పినాకీ?'' బల్ల మీది ముక్క తీసుకున్నాడు.

''కంసుని యిగో చూస్తే వాణికి నవ్వు వచ్చి వుండాలి రాములూ. '' ఒరే! రథం అంత వేగంగా మబ్బుల మీద పోతున్నట్టు తోలుతున్నావు. కన్నూ మిన్నూ

కానరావటం లేదు నీకు. యే చెల్లెల్ని అత్తింట్లో దింపి రావాలని పోతున్నావో ఆ చెల్లి యెనిమిదో సంతానమే నీ పాలిట మృత్యువు అవుతాడు. పొగరు దించుకో'' అని నవ్వి మాయమైంది. కంసుడు సైకో. ''యెనిమిదో బిడ్డదాకా యెందుకూ వేచి చూడటం? ఈ చెల్లి నిప్పుడే చంపేస్తా'' అనుకుంటూ రథం ఆపి కిందికి దూకి, చెల్లెల్ని కిందికి లాగి కత్తి దూశాడు కంస. కంసుని తత్త్వం బావమరిది వసుదేవునికి తెలుసు. ''కొత్త పెళ్లి కూతురు. అందునా నాభార్య బావా! చంపరాదు. యెనిమిదో సంతానం గదా నీ పాలిట మృత్యువు. ముందు పుట్టిన యేడుగురూ నిన్నేమీ చేయరు గదా. నీ కంతగా అనుమానంగా వుంటే, పుట్టగానే బిడ్డను తెచ్చి నీ కిస్తా చంపుకో. మాటిస్తున్నా'' అన్నాడు బావమరిది చేతులు పట్టుకుని ''అది నిజమే'' అనుకున్నాడు కంస. బావ వసుదేవ మాట నిలకడ గలవాడు. చెల్లెల్నీ బావ నీ రథంలో కెక్కమని తోలుకెళ్లి దింపి వచ్చాడు.

''అంటే వసుదేవ సైకో ఎనలిస్ట్ అన్నమాట'' అన్నాడు రాములు.

''బాగా అన్నావు రాములూ. యెనిమిదో సంతానాన్నిస్తానని అనలేదు వసుదేవ. అది గమనించాలి. గడసరి అనచ్చు. తీరా మొదటి బిడ్డను తెచ్చి కంసుని ముందుంచి ''చంపుకో'' అంటే అప్పటికి వుధృతం తగ్గిన కంస, యెనిమిదో సంతానం గదా వీడు గాదు. తీసికెళ్లి పెంచుకో అని పంపేశాడు. మళ్లీ కొ(రెక్కినప్పుడు తండ్రి ఉగ్రమసేనుడు దద్దమ్మలాగా కనబడి, వాడిని జైల్లోకి తోసి తాను గద్దె యెక్కాడు'' అని చెప్తుండగా రాములు సెట్ బల్లమీద పరిచేశాడు. సెట్ కాని వాళ్లంతా బల్లమీద ముక్కలుంచి లెక్కవేసి కౌంటర్స్, కాయిన్స్ తీసుకున్నారు. మళ్లా షఫుల్ చేసి కోయించి పంచుతూ రాములన్నాడు ''థ్రిల్లింగా వున్నది. ఔరంగజేబు తండ్రి షాజహాను చక్రవర్తిని హౌస్ అరెస్టులో వుంచాడు. అన్న దారానూ, వాడి కొడుకును చంపించి గద్దె యెక్కాడు. ఐడియా మంచిదేట. ఇస్లామ్ వ్యాపింప జేయాలనిట. కష్టజీవి. ఖురాన్ ప్రతులు వ్రాసి, టోపీలు కుట్టీ ఆర్జించిన సొమ్ముతో జీవిస్తున్నానన్నాడట'' అంటున్నాడు రాములు. శంకర్, మల్లయ్య వచ్చి కూచుని తమకూ పంచమన్నారు. వాళ్లు త్వరగానే కధ ఫాలో

అయారు. పినాకి సంతోషించాడు. ''నారదుడొచ్చి కంసునికి పురెక్కించాడని హరివంశంలో గాబోలు చదివాను పినాకీ'' అన్నాడు మల్లయ్య వురఫ్ మల్లిఖార్జునరావు. పినాకి మల్లయ్యను చూసి సంతోషించి అన్నాడు. ''కావచ్చు. యెలా వ్రాసినా దేవకి సంతానాన్ని ఖతమ్ చేసింది అన్న కంస మహారాజే'' యెవరీ పిల్లలు కంస మహారాజా!'' అనడిగితే ''మా దేవకి పిల్లలు'' అన్నాడట. ''వీళ్లు నీ పాలిట మృత్యువులు గదూ కంస మహారాజా?''. ''వీళ్లు గాదు నారదా యెనిమిదో వాడు'' అని జవాబు.

''అయ్యో! అమాయక కంస మహారాజా'' అని నవ్వి నారదుడు చూపుడువేలితో లెక్కిస్తూ ఒక్కో బిడ్డ నెత్తి మీదికి వేలు రానిచ్చి ''యెనిమిది'' అన్నాడు.

నారదుడు వెళ్లాక కంసుడా బిడ్డలని చంపించాడు. బావనీ చెల్లెల్నీ నిజంగానే ఖైదు చేశాడు. మహామాయ యేడో పిండాన్ని మార్చేసింది. రోహిణి అనే ఆమె వసుదేవుని భార్యే. ఆమె గర్భంలో దాచి, ఆమె పిండాన్ని దేవకి గర్భంలో వుంచింది. ఏడో బిడ్డనూ చంపాడు కంస. అసలు ఘట్టం వచ్చింది. దేవుని సలహా ప్రకారం వసుదేవుడు యెనిమిదవ బిడ్డ పుట్టగానే తట్టలో పెట్టుకెళ్తుంటే తలుపులవే విడిబడినై. కాని వీధిలోకి రాగానే గాడిద అరిచిందట. వసుదేవుడు గాడిద కాళ్లు పట్టుకుని, ''అరవవోకు తల్లీ! కంస మహారాజు లేచి బిడ్డను చంపుతాడు. యీ బిడ్డను వ్రేపల్లెలో నందగోపుని యింట్లో, అతని భార్య యశోద పక్కలో వుంచి, ఆమె ప్రసవించిన ఆడపిల్లను తెచ్చి దేవకి పక్కన వుంచాలి'' అని వేడుకున్నాడట. మరో వుపద్రం. యమునా నది దాటాలి. వాన. నది పొంగుతున్నది. ఆదిశేషుడొచ్చి తన పడగలు విప్పి తట్టలో బిడ్డ తడవకుండా కాపాడుతున్నాడు. అయినా యమున పొంగు తగ్గలేదు. హెచ్చింది. వసుదేవుడు ధైర్యంగా నదిలో నడుస్తూనే వున్నాడు. పిల్లవాడి కాలివేలు తట్ట అంచులకుతాకుతూ నదిని తాకింది. యమున దోవ వదిలింది. మొత్తానికి పని సాధించాడు వసుదేవుడు. పిల్లను దేవకి పక్కన వుంచుతుండగా కారాగారం తలుపులవే మూతపడినై. స్పృహ తప్పి వున్న

దేవకికి పిల్ల యేడవగానే కళ్లు తెరుపుడు పడినై. కావలివారు లేచారు. పిల్ల యేడుపు విని వెళ్లి కంస మహారాజును లేపి తెచ్చారు. తెల్లవారుతున్నది.

దేవకి యేడుస్తూ, ''అన్న! క్షమింపుమన్న! అల్లుడు కాదిది మేనగోడలే! మన్నన సేయుమన్న! మానిని చంపుట రాచపాడిగాదన్న'' అని దీనాలాపాలాడింది.

కాని కంస యెనిమిదో బిడ్డే తనకు మృత్యువు అని, చెల్లి యేడుపును పెడచెవిని బెట్టి, ఆమె చేతుల్లోని బిడ్డను లాగి పైకెగరేసి కత్తి కెరచేయాలని, కత్తి దూసి పట్టాడు. కాని వింతలలో కెల్ల వింత! ఆ బిడ్డ కిందికి రాక పైకే యెగసి ఆకాశంలో వేయి చేతులతో మెరుపులాగా వెలుగుతూ, పకాపక నవ్వుతూ, '' ఒరే! నిన్ను చంపేవాడు వ్రేపల్లెలో పెరుగుతున్నాడు'' అని అదృశ్యమైంది. కంసుడు నివ్వెరపోయాడు. బిడ్డను తప్పించారన్నమాట. మార్పిడీ జరిగింది అని గ్రహించి వసుదేవుని వంకచూశాడు'' వేసిన తాళాలు వేసినట్టే వున్నాయి. తలుపులు మూసే వున్నాయి కంస మహారాజా. యెలా తప్పించగలను'' అన్నాడు వసుదేవుడు. దేవకీ వసుదేవులూ ఆశ్చర్యపోయారు.

అప్పుడు మోసగించారని, యినప గొలుసులు వేయించి గట్టి కారాగారంలో వుంచాడు కంసుడు. వ్రేపల్లెలో బిడ్డ పెరిగి పెద్దవాడు కాకుండా చంపించాలని పథకాలు ఆలోచించాడు'' నింపాదిగా చెప్తున్నాడు పినాకి.

'' ఇంతకూ పరంధామ్ దేనితో చెలగాటమాడాడో చెప్పనే లేదు నువ్వు పినాకీ. కథ వేరుపుంతలు తొక్కింది''. బాంక్ యేజెంట్ నందకిశోర్ అన్నాడు.

'‘పరంధామ్ మిఠాయి చూపించి లేడీ లవర్ని పట్టాడుట''.

'అది చెలగాటమెలా అయిందీ?'' కిశోర్ అడిగాడు.

''కృష్ణుని ధూర్త గోపాలా అని పిలిచేవారట గోపికలు. తంతు జరుపుకోకుండా మీద బడేవాడు ధూర్తుడనబడును'' అంటున్నాడు పినాకి.

''కృష్ణుడు మంచివాడేగా?'' మరో ఆటగాడన్నాడు.

''అఫ్‌కోర్సు. దేవుడు బహుమంచివాడు. దీనులను పాలించువాడూనూ. కాని పతివ్రత గాంధారి అలా ఒప్పుకోక ''కృష్ణా! నువే యీ యుద్ధానికీ, అన్నదమ్ములు కొట్టుకు చావటానికీ కారణం. చిన్నతనంలో అన్ని మహిమలు చూపినవాడివీ సంధి చేయలేకపోయినావంటే నమ్ముతానా? యాదవులూ యిలాగే కొట్టుకు చస్తారు'' అని శపించిందట.

''కృష్ణుడు పరమాత్మ గదా నొచ్చుకోడే స్పోర్టివ్‌గా తీసుకుంటాడు'' అన్నాడు పెంచలయ్య సిబిఐ ఆఫీసర్.

''అబ్బో ఆఫీసర్‌గారికి చాలా తెలుసే? యేమీ తెలియదనుకున్నా. కృష్ణుడు నవ్వి, ''యాదవులు పొగరెక్కి వాళ్లకి వాళ్లే హాని చేసుకున్నారెప్పుడో. దూర్వాస మహాముని ద్వారక వచ్చి వూరి చివర చెట్టు కింద కూచున్నాడు. సాంబునికి గర్భిణీ స్త్రీ వేషం వేసి తీసికెళ్లి, మునికి చూపించి, ''దీనికి ఆడబిడ్డ పుడుతుందా? మగబిడ్డ పుడుతాడా చెప్పండి మునీ?'' అని అడిగారు యాదవులు. ముని కోపగించి శపించితే యాదవులు భయపడిపోయారు. నా వద్దకు వచ్చి అంతా చెప్పి, ''వుపాయం చూడు కృష్ణా. దూర్వాస మహామునితో యెకసక్కెమాడాము. అది చెలగాటమే'' అన్నారు.

''బ్రాహ్మణ శాపం గదా. ముసలమేమో పుడుతుంది. దాన్ని తీసికెళ్లి మెత్తగా నూరి సముద్రంలో కలిపేయండి'' అని చెప్పానత్తా'' అని చెప్పాడు పినాకి.

''అసలు కథ కానీ పినాకీ. కౌతూహలంబయ్యెడిన్. చెలగాటమెలా అయిందీ?'' అర్జున్ రచయిత అడిగాడు.

''జాబ్‌కి తిలోదకాలిచ్చిందిట మిఠాయి తిన్న లేడీ లవర్'' పరంధాముడు విరగబడి నవ్వుతూ చెప్పాడు. ''అయ్యో పినాకీ యెబార్షన్ అనే పదం వాడగానే మీదబడి రక్కింది. రక్కులన్నీ భరించి, అనునయించి యెలాగో ఒప్పించి, నర్సింగ్ హోమ్‌లో ఎడ్మిట్ చేసి నేను యూరప్ టూర్ చేసి వచ్చేప్పటికి ''వుయ్యాల్లో వేలెడు పిల్లాడిని చూపించి, నార్మల్ డెలివరీయే'' అన్నది. సెవెన్ వండర్సులో యిదో వండర్ అనిపించింది పినాకీ. బేబీ సిట్టింగ్ వాల్యుయేబుల్‌గా

కనిపించిందిట. జాబ్ వర్త్‌లెస్‌గా తోచిందట. బుర్రగోక్కుంటూ యిల్లూ కూడూ గుడ్డా చూడాల్సి వచ్చింది పినాకీ. నా పేద బుర్రనెంత గోకినా యేమీ అంతుబట్ట లేదు''.

''అది చెలగాటమే. మనిషేగా అమ్మాయీ. పురుక్కాదే'' అన్నా. వెంటబడుతుందిట. నలుగురూ నవ్వరా అని అపుతాడుట పరంధాముడు. ఇంకా ''దీన్నెట్లా మోహించావూ? సెడ్యూస్ చేసిందా? అని నా స్నేహితులు రోడ్డు మీద తారసపడి అంటే, అక్కడే రోడ్డు మీద బడియేడుస్తావు'' అని ఆపేస్తాడట. అలా ప్రేమ కలాపం నటించే సెన్సిటివ్ మనస్సుగల అమ్మాయిని శాయశక్తులా ఛాన్సు వదులుకోకుండా నొవ్వనాడుతూనే వచ్చాడు.

''అలా హర్ట్ చేసే వంకీ స్వభావం వయసొచ్చాకే రాదు పినాకీ చిన్నప్పటినించే వుంటుంది'' అన్నాడాఫీసర్. ''నిజమే కావచ్చు. ఆఫీసర్ కాలేజీ రోజుల్లోనే. లాబ్‌లో యేదో ఒకటి పోతూ వుండేది. రాజగోపాల్ అటెండర్, వీరేశ అనే డెమాన్‌స్ట్రేటరూ యెవరి మీదికో ఒకరిమీదికి నెట్టేవారట ఆ దొంగతనాన్ని. ఫైన్ అదీ కాకపోతే ధర కట్టించేవాడుట ప్రిన్సిపాల్. ఇంటి దొంగను ఈశ్వరుడు గూడా పట్టలేడని వింత సామెత. పరంధామ్ మీదికీ యెక్కింది నేరం. బిక్క మొహాలు చూస్తూ వారి గోడు వింటూ వచ్చిన పరంధామ్, ''అవన్నీ నిరంజన్ సెట్లో వుంటాయి. వాడు క్లెప్టోమానియా లాగా కనబడతాడు నాకు'' అన్నాడట.

''హారిబుల్ పరంధామ్. నిరంజన్ ప్రిన్సిపాల్ ప్రియబాంధవుడు. వాడినెలా పట్టిస్తాం? మనమీదికే వస్తుంది. ఋజువు చేయాలి'' అన్నాడో విద్యార్థి.

''వాడు ఆవకాయ తెచ్చుకుని పెట్లో దాచుకుని బోజనానికొచ్చేప్పుడు చిన్న ప్లాస్టిక్ భరిణలో ముక్క పిండీ తెచ్చుకుని భోజనం కాగానే భరిణ ప్లాస్టిక్ సంచీలో పెట్టుకు తీసికెళ్తాడు. యెవరికీ రుచన్నా చూపడు మీరు గమనించలేదేమో'' అన్నాడు నవ్వుతూ.

''గమనించాంగానీ సాహసం లేదు. నెత్తడుస్తుందేమో''.

నిరంజన్ స్కూటరెక్కి కాలరెగరేసుకుంటూ సహ విద్యార్థులతో సాయంకాలం వరకు పిక్‌నిక్ చేయటానికి వెళ్లాడు. శలవు. ఆదివారం.

మారుతాళంపెట్టి లాకర్ తీసి పెట్టె కదిలిస్తే బాగానే చప్పుడైంది. ప్రిన్సిపాల్, డెమాన్‌స్ట్రేటర్, ప్యూన్, అందరి యెదట మూత తీశాడు పరంధామ్. లాబ్‌లో పోయిన వస్తువులన్నీ పెట్టెలో వున్నాయి గానీ, ఆవకాయ సీసా మూత వూడి వూటా పిండీ రెడీమేడ్ దుస్తుల మీద ఇస్త్రీ దుస్తుల మీదా ఒలికి రక్తంలాగా కనిపించింది'' పినాకి గడియారం వంక చూస్తూ ఉన్నాడు. గోడ గడియారం టిక్ టిక్ మంటున్నది. గుండెలు దడదడలాడినట్లున్నదా చప్పుడు.

''థ్రిల్లింగా ఉన్నది పినాకీ యెలా ముగిసిందీ కథ?''

''నాకే కష్టమేసింది అని చెపుతూ నవ్వుతాడు పరంధామ్. మంచి సూట్లన్నీ పాడైనై అని నవ్వుతాడు. ప్రిన్సిపాల్ నిరంజన్ని దత్తు చేసుకుని తన మేడకోడల్నిచ్చి పెళ్లి వైభవంగా జరపాలని నిశ్చయించాడు. దాన్ని మార్చే ఛాన్సు లేదు. అన్నీ స్థిరపడినై. సైకియాట్రిస్ట్ జబ్బు పేరు చెప్పేశాడు. ప్రిన్సిపాల్ హర్ట్ అయినా 'పరంధామ్! సిబిఐ డిపార్టుమెంటులోకి పనికి వస్తావు. నా ఫీలింగ్సుతో చెలగాటమాడినా, ఆరేళ్లు పరీక్షలకు హాజరయే అవకాశం లేకుండా చేయగలను నిన్ను. డిబార్ చేసే అధికారముంది నాకు. కాని క్షమించి పరీక్షలకు కూచోనిస్తున్నా. పరీక్షలు ముగియగానే కాలేజీ, హాస్టలూ గూడా వదిలి వెళ్లిపో. ఇంక నీ మొహం నాకు చూపించకు. పోస్టు ద్వారా నీ సర్టిఫికెట్ వస్తుంది'' అన్నాడు కోపగించకుండా.

''థాంక్యూ సర్, యస్సర్'' అని నవ్వుతూ జవాబిచ్చాడు పరంధామ్.

''వండర్‌ఫుల్. చెప్పటమూ బాగుంది పినాకీ. మెడిల్‌సమ్మని తెలుస్తున్నది. అయినా తక్కిన విద్యార్థులు సంతోషించి వుండాలి. వారి డబ్బు వారికి వాపస్ అవుతుంది. లేద్దామా? చాలా పొద్దుబోయింది. నొప్పింపక తానొవ్వక అన్నాడు శతకకారుడు'' అని ముక్కలు కలిపేశాడు, ఆఫీసర్.

''గేలి హూమర్ అనుకుంటూ చెలగాటమాడుతున్నావని వార్నింగిచ్చాను. మిత్రము తగు మందు అన్నారు కవులు. మిత్రుడిని గదా'' అని లేచాడు పినాకి.

2

కుంతల మనోహరంగా నవ్వుతూ, కదుల్తూ వూగుతూ చెప్తున్నది వింటున్నాడు పినాకి. అది సంధ్యా సమయం. సాయం సేవ జరుగుతున్నది. త్వరత్వరగా విస్తరించిన, భవనాలతో నిండిపోయిన ఆ ప్రదేశానికి పాండురంగపురమని పేరుబెట్టారు. సన్నాయి రాగాలాపన వాయిస్తున్నాడు ప్లేయరు. మరొకడు తబలా వాయిస్తున్నాడు. భక్తులు వచ్చి, ప్రదక్షిణలు చేసి, ప్రసాదం అందుకుని, కుంకుమ నుదుట వుంచుకుని, హారతి పళ్లెంలోనూ, హుండీలోనూ దక్షిణ వేసి, రంగని పాదాలకూ, రుక్మాబాయి పాదాలకు తల ఆన్చి మొక్కి వెళ్లి వరండాలో కూచుని, ప్రసాదం తింటూ మంగళ వాయిద్యాలు వింటున్నారు. కొంతమంది భక్తులు ముష్టి విదిలించి గుడి వదులుతున్నారు. వాహనాలున్నవారు వాటిలో దూరి చక్రం బడుతుంటే ఆటోలు పరుగు తీశాయి. కొందరు నడక పుచ్చుకున్నారు.

సముద్ర ఘోష వింటున్నాడు. విరిగిపడే అలలనూ చూస్తున్నాడు. కుంతల పేలాపనా వింటున్నాడు పినాకి. కుంతలను జాలిగా చూశాడు. ''ధర్మంతో చెలగాట మాడుతున్నావు కుంతలా. కర్ణునికి వాని గురువు పరశు రామ తెలియజెప్పాడు. ''అస్త్ర శస్త్రాలున్నాయనే అహంతో అధర్మపక్షాన చేరి ధర్మంతో చెలగాట మాడబోతున్నావు శిష్యా!'' కర్ణుడు విన్నట్టు లేదు. లక్ష్యపెట్టనట్టే తేలింది. చాలా చివరికి ''మీరు రథం మీదున్నారు. నేను కింద వున్నాను. ఇది అధర్మం'' అన్నాడు. కృష్ణుడు నవ్వుతూ బాగా అంటిస్తే చూస్తూ నిలబడిపోయాడు కర్ణ'' ధర్మం యిపుడే యెందుకు గుర్తు వచ్చింది కర్ణా! సభలో ద్రౌపది అవమానింపబడుతూ యేడిస్తే, 'సభలో యెవరూ లేరా? ఇంటి కోడల్ని వివస్త్రను చేయబూనటం ధర్మమేనా? ఈ దుశ్శాసనుని వారించరా'' అని అందర్నీ చూస్తుంటే నువ్వూ వున్నావు సభలో. నోరు బడిందా? చెవుడొచ్చిందా?

అన్నదమ్ములవమానించుకొని వూరుకోక ఆడపిల్ల నెందుకు అవమానిస్తారు?'' అని దుశ్శాసనుని తరిమేయలేదేం?'' అన్నాడు కృష్ణ. వికలమైనా గదా అని అలాగే వుండి పోక్కర్లేదు కుంతలా. దైవాన్ని ఆశ్రయిస్తే కడతేరుస్తాడు'' అన్నాడు పినాకి.

''నీ సారంగ నీతులూ, సాధువాదం పనికిరావు పినాకీ. సుధాకర్ తెలివితేటలూ వాడూ! నన్ను నిరసిస్తే వాడి పనిబట్టాలి'' అని సుందరంగా నవ్వి, '' ఆ కురూపిని చేరదీయటం, భువన మోహినిని నన్ను నిరసించటం తెలివా? తెలివి తక్కువా ఆకలెక్కువా సుధాకి. తెగోదారీ నెరదాత అని పేరుబడిన మనిషి, నా సొమ్ము నన్ను తినమనటమేమిటీ? బోడి సలహా పొందాలనా వీడికోసం తపించానూ'' అని పకాపక నవ్వుతూ వూగిపోయింది కుంతల.

''అదే చెలగాటం కుంతలా. సుధా యెవర్నీ చేరదీయనూ లేదు. మోహమూ కాదది. ఒక తెలివిగల అమ్మాయిని చదివించాలని ఆశించాడంతే, ఫౌండర్సూ, లీడర్సూ, మినిస్టర్సూ ఒక స్త్రీని సుప్రిమోగా తయారుచేయాలని చూస్తారు, సమర్థతను బట్టి చేస్తారు గూడాను. చూస్తున్నాంగా. అలాగే సుధా. నువ్వు దేని వెంటబడుతున్నావో నీకు తెలియదేమో. సుధా వెంటగాదు కుంతలా. శరీరాకర్షణకు లొంగడు సుధా. దయగలిగి వుందామని చూస్తాడు. అతని సూచనలు నీకు నచ్చలేదు. నిన్ను నీవు సపోర్టు చేసుకో, నేను నీ హితైషినే అన్నాడు గాని ఒక స్త్రీని గుదిబండలాగా చేసుకుని దాని బరువు భారాలూ మోద్దామని ఆలోచించడు. అరకొరగా వున్న తన వ్యాపారాన్ని మోడరనైజ్ చేసి వన్ ఆఫ్ది బెస్ట్ అనిపించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. తక్కినవి హాబీలే. నీ కెందుకు లొంగుతాడూ? దొరబాబూ అంతే. నేర పరిశోధనలో ఘనుడుగావాలని సాహసం మేధస్సూ అప్లై చేస్తున్నాడు. వాడికి లంపటత్త్వం మప్పాలని చూడటం చెలగాటమే. పనికిరానివానిగా చేయాలని చూస్తారు స్త్రీలు అని నవ్వుతాడు. ఏతాహస్తిచరుదస్తిచ కార్యహేతో అన్నాడు భర్తృహరి''.

విఠోబాకి తెరగట్టటం స్నానం, అలంకారం, పూజా నైవేద్యం, మంత్రపుష్పం ముగిశాయి. కుంతల నవ్వుతున్నది ''మోటువాడికి మొగలిపూవిస్తే

మడిచి యెక్కడో పెట్టుకున్నాడట. చెప్పేది విని అర్థం చేసుకోకుండా పుట్టి ధ్వని రిసీవ్ చేసినవానిని బైరాగి అంటారు. అదే వైరాగ్యమట. సింపథీ కూడా లేదేమో నీకు''.

''నేటినించి నిన్ను బైరాగీ అని పిలుస్తున్నాను'' అని నవ్వుతున్నది కుంతల. ప్రసాదం పంచుతున్నాడు. ఒక భక్తుడు పాడుతూ నిలబడ్డాడు. ''రంగా! రంగా! రంగా! రంగా! రంగా! యనుడీ! మంగళ కరుడగు పాండురంగని మదిలోదలచండీ, పుట్టినందులకు పొట్ట నింపుటయె, పురుషార్థముగాదండీ॥

3

పినాకి అనే పేరు మరుగున పడి బైరాగి అనే పేరే స్థిరపడింది. పని తనను వరించి వస్తే చేస్తాడు. పని లేకపోతే రంగని గుడి వరండాలో కూచుని, పొద్దునా సాయంత్రం భక్తి గీతాలు పాడుతాడు. రామదాసు, మీరా మాయి, తులసీదాస్, సూరదాస్, నర్సీమెహతా, పురంధరదాస్, త్యాగరాజ్ స్వామి, శ్యామశాస్త్రి, దీక్షితార్‌వి తీయగా పాడుతాడు. హార్మోనియం యిస్తే, వాయిస్తూ పాడుతాడు. తబలా వాయిస్తూ పాడుతాడు. శ్రోతలు చేరుతారు. ప్రసాదం తిని శంకరమఠానికెళ్లి వరండాలో నిద్ర తీస్తాడు. ఒకనాడొక భూస్వామి వచ్చాడు. బైరాగి భక్తి గీతాలు విన్నాడు. శ్లోకాలూ విన్నాడు. శ్రీరామచంద్ర కృపాళు భజుమన। హరన భవభయు దారుణం॥ శ్రీరామ చంద్రశ్రి పారుజాత। సమస్త కళ్యాణగుణాభిరామ॥ అనే శ్లోకం. బసోమేరేనైందనమే నందలాల్ అనే మీరా భజన్। నర్సీ మెహతా వైష్ణవజానతో తేనెకహియే॥ రఘుపతి రాఘవ రాజారామ్॥ బ్రోవవమ్మ తామసమేలే॥ తెరతీయగ రాదా॥ యే తీరుగ నను దయచూచెదవో॥ రామచంద్ర భక్తం భజమానస॥ మనుజా శరీర విదేనుసుఖా॥ పాత సినీసంగీతం॥ పాత నాటకాలలోని సక్కుబాయి పాట ''పరాకా కరుణాసాగరా పల్కులే వినలేవా? రంగా॥ కదలదు నీ సంకల్పము లేనిదే॥ ఈశ్వర సంకల్పమెవ్వరెరుంగుదురు॥

దివ్యహారతి యిచ్చే వరకు వుండి, ప్రసాదం అందుకున్నాడు. చనువుగా బైరాగి బాబాయి పక్కన చేరి అన్నాడు.

''బాబయ్యగారూ! నా మనవి ఆలకిస్తారా? నా పేరు లక్ష్మయ్య. భూస్వామిని'' పరిచయం చేసుకున్నాడు.

''తప్పకుండా లక్ష్మయ్య. సందేహమెందుకూ?''

''నేను మానవసేవ చేయాలనే ఆశతో, పనివారికీ, వారి బిడ్డలకూ బడి పెట్టాను. వయోజన విద్యా, ప్రాథమిక విద్య. కాని బడి నడపటం రాదు. శిక్షణ, సత్ప్రవర్తనా, నిజాయితీ, సేవాభావం అలవడాలి పిల్లలకి. అవీ బోధనాంశాలే. రోజూ ఒకపురాణగాథా, ప్రార్థనా అవీ వున్నాయి. వ్యాయామం పది నిమిషాలు. మీరు శ్రమ తీసుకుని ఆ బడి సజావుగా నడిచేట్టు చూడాలి. ఇల్లూ, దీపం, నీరూ, తిండీ ఫ్రీ. పిల్లలకు, వృద్ధులకూ మధ్యాహ్న భోజనం యేర్పాటు చేశాను. నలుగురుపాధ్యాయులున్నారు. వారికి జీతమేర్పాటు చేశాను''.

''మంచి పనికి వేడికోలేందుకూ? లక్ష్మయ్యా! మానవ సేవే మాధవ సేవా. పద నీతో వస్తున్నాను. మఠా నిద్రకు స్వస్తి'' అని లేచాడు బైరాగి.

అలా తనను వరించి వచ్చిన పనిలో లీనమై ఆనందిస్తూ పిల్లలకు తోటపనీ, కూరలు పండించటం నేర్పాడు బైరాగి బాబాయి.

వూరు వ్యాపిస్తున్నది. భవనాలు లేస్తున్నాయి. గొట్టపు బావులు. లిఫ్టులు, కాంటీన్లు, రెస్టారెంట్లు వూరికి శోభనిచ్చాయి. బాబాయికి పేరొచ్చింది. పాఠశాల పెద్దదైంది. స్ట్రెంగ్త్ పెరిగింది. వయోజన విద్య భాగం విడిగా, బాలబాలికల పాఠశాలా విడిగా అయినై. వూరు జనాభా పెరిగింది. వాహనాలు పెరిగినై. పార్కులు తెలిసినై. నాటక, సంగీత మందిరం తయారైంది. రాముని గుడి. కళ్యాణ మంటపం. గ్రాంట్సూ వచ్చాయి. ఒక యోగి ఆశ్రమం మొదలెట్టి యోగాభ్యాసం నేర్పుతున్నాడు. వైద్యశాల. పశు వైద్యశాల. తపాలా ఆఫీసు. బాంకు.

ఆనాడు శలవు. బాబాయి దినపత్రిక తిరగేస్తున్నాడు. ఓ కాంట్రాక్టరు వచ్చి తనను తాను పరిచయం చేసుకుని వచ్చిన గడ్డు సమస్య చెప్పి సలహా అడిగాడు బాబాయిని.

అంతా విశదంగా విన్న బైరాగి ఆశ్చర్యాన్ని అణిచిపెట్టి, ''చెలగాటమాడావే సత్తి రాజూ! సత్యమేవ జయతే. యెలా పైకి తేలుతుందో గాని నిజం బైటబడుతుంది. అది దాని నైజం. సత్యమే దైవం. దాన్నే ఆరాధించాలి ముందేమో వచ్చిన తగాదా పరిష్కరించక పక్షపాత వైఖరి అవలంబించావు. వడ్డించేవాడు మనవాడేనన్ే ధీమాతో కొత్తగా వచ్చి చేరిన కూలీని కిట్టప్పని రెచ్చగొట్టి వాడు కలియబడితే పూర్తిగా వచ్చిన భవనం ఆరవ అంతస్తునించి కిట్టప్పను తోస్తే ప్రమాదమైంది. వెంటనే పల్లెలోని భార్యను పిలిపించి ప్రమాదం జరిగిందనక మసిబూసి మారేడు కాయ చేశావు. భార్య వచ్చే లోపల అంత్యక్రియలూ జరిగిపోయాయి. తీరా భార్య వస్తే డబ్బు యివ్వజూశావు. గప్‌చిప్ అన్నావు. నీ యిగో నిన్ను లొంగదీసింది సత్తిరాజూ. భార్య అనుమానం పెనుభూతమైంది. చంపారని తేల్చిందా పల్లెపడుచు. కోతి పుండు బ్రహ్మరాక్షసైంది తగాదా. లాయరును సంప్రదించక తిమ్మిని బ్రహ్మి, బ్రహ్మిని తిమ్మి చేయబూనావు. ఇపుడు, మానవ హక్కుల పరిరక్షణ, మహిళా సంఘాలు, కార్మిక యూనియన్లు, శాసన సభ్యులు, కాకలు తీరిన పోలీసులు. ఇప్పటికైనా చెలగాటం మాని సత్యం చెప్పి పరిహారమియ్యి. పరిష్కారమవుతుంది గొడవ'' అన్నాడు బైరాగి.

'' ఇలా చెప్తారనుకోలేదు బాబయ్యగారూ? సద్దుబాటు చేస్తారని గంపెడాశతో వస్తిని'' అన్నాడు దోషి.

''అయ్యో! సత్తిరాజూ! బాపూ యిలాగే సలహా యిచ్చారు. నీకు తెలియదేమో. ఒక వ్యాపారి పన్ను యెగేస్తే, కేసైంది. న్యాయవాది అయిన బాపూనాశ్రయిస్తే, 'పూర్తి పన్ను చెల్లించి అపాలజీ యివ్వు. కేసు మాఫీ చేస్తారు'' అన్నారు బాపూ. వ్యాపారి అలాగే చేసి కేసులోంచి బైటపడ్డాడు. బాపు సలహా పఠం కట్టించి హాలులో గోడకు వేలాడదీశాడా వ్యాపారి''.

సత్తిరాజు వుత్తరీయం దులుపుతూ లేచి వెళ్లిపోయాడు. పండగలు, ఆదివారం కలిసొచ్చి మూడురోజులు శలవులిచ్చారు బడికి. నాల్గవరోజున బైరాగి దినపత్రిక తిరగేస్తుంటే, సత్తిరాజు కేసు కోర్టు వరకూ వెళ్లిందని వివరాలు, పోలీసు వారి కథనం ప్రకారం అని చదువుతున్నాడు బైరాగి. ''పినాకీ!'' అనే పిలుపు. పరిచితమైన గొంతు. పత్రిక అవతలుంచి లేచి వెళ్లి గేటు తీశారు బైరాగి. ఆశ్చర్యపోతూ ''లోపలికి రా మిత్రమా! చాలా తీసేశావే! తల ముగ్గ బుట్ట అయింది. హుషారు, నగుమోమూ, ఆటలేకితనం యేవీ? ధర్మాత్మాలాగా కనబడుతున్నావు పరంధామ్. పెద్ద పులి లాగా పొంచి వుండి వృద్ధాప్యం మీద దూకిందా? బండి లాగలేక లాగలేక లాగుతున్న వాడల్లే వున్నావు'' అని సాదరంగా వెంటబెట్టు కెళ్లాడు. పొద్దూకవస్తున్నది.

స్నానం, పానం, భోజనం, విశ్రాంతీ సేదదీర్చాయి. మంచి నిద్రబట్టింది రాత్రికి.

మరునాడు కాలకృత్యాలయాక తిప్పి చూపించాడు పినాకి. పిల్లలను, వుపాధ్యాయులను, ఫౌండర్నీ పరిచయం చేశాడు. కొత్తగా కట్టి రన్ చేస్తున్న వసతి గృహం చూపాడు. పిల్లల ఆటపాటలు చూపాడు. క్రమశిక్షణ గమనించాడు పరంధామ్. ''బాబాయ్'' అని పిలుస్తారు పిల్లలు పినాకిని.

తిరిగి క్వార్టర్సుకి వచ్చి హాలులో కుర్చీల్లో కూచున్నారు. పంకా తిరుగుతున్నది. కొత్తగా అమర్చిన యెయిర్ కూలరూ పనిచేస్తున్నది.

''యెల్లప్పుడూ నవ్వు మొహం, కదిలిపోతూ కబుర్లాడటం గూళ్లు తిప్పుతూ నడవటం, గూళ్లెగరేస్తూ హ్యూమరస్ వేలో మాట్లాడటం లేవేం వెంగళ్రావ్? నీకు మీ ముత్తాత పేరు పెట్టారు. ఆయన ఆస్తి పెద్దది చేసి, వూరి పెద్ద అయి తీర్పులు చెపుతూ, గ్రామస్థులు న్యాయస్థానానికెక్కకుండా వారి తగాదాలు వారి మధ్యే సర్దుబాటు చేసేవాడు. ఆడపిల్లల పెళ్లిళ్లకి ధన సహాయం, మేనేజ్‌మెంటూ చూసేవాడు. నిండా శతాయుష్మంతుడై, రోగం రొష్టూ లేక, మంచానబడక ఒక్కరోజులో పోయాడు. గ్రామం బాగా ప్రగతి సంపాయించి

ఆయన శిలా ప్రతిమ ఆయన యింటి ముందు ప్రతిష్ఠించారు. ఇల్లు బడి అయింది. వెనకాల స్థలంలో పార్క్ వేశారు. ఒక్కతే కూతురు ఆయనకు. పెళ్లి చేశాడు. మనుమడి నిచ్చి పోయింది కూతురు. అల్లుడు మళ్లా పెళ్లాడాడు. మనుమడిని దత్తు చేసుకున్నాడు తాత. వారి వారసులే మీరంతా. నీ అల్లరి ఆడపిల్లల నేడిపించటం చూసి వెంగళ్రావ్ అనీ వెంగలిరావ్ అని ముద్దు చేశారు నిన్ను. ఇంకా రోజులు గడవగా రావ్ తీసేసి ''వెంగలీ'' అని చనవుగా ప్రేమగా పిలిచేవారు. మీ అమ్మమ్మా తాతయ్యా బళ్లో వేసి ఒడుగుచేసి పరంధామ్ అని పేరు వేయించారు. పెద్దవాడివౌతుండగా మొదటి నామధేయం మరుగునపడినా వృద్ధులాపేరుతోనే పిలుస్తూ వచ్చారు. నాకు పినాకి అనే పేరు పోయి బైరాగి అనే పేరే స్థిరపడింది. ఇది కుంతల పెట్టింది. ఆమె చెలగాటమాడుతుంటే నీకు చెప్పినట్టే చెప్పాను మిత్రమా. తన గోడు వినలేదనీ వొట్టి ధ్వని విన్నాననీ అలా పెట్టింది. వినేదాంట్లో ఇంటరెస్టు లేక వారి పక్షం మాటాడని వారినలా అంటారుట. ఇక్కడెవరికీ నా పేరే తెలియదు. నువ్వు నా అసలు పేరుతో పిలిస్తే లేచి వచ్చా'' అని మైత్రి వెల్లడించాడు పినాకి.

నొప్పి కలగనట్టు కనపడాలని ప్రయత్నిస్తున్నా, మిత్రుని మానసిక వ్యధా వేదనా గుర్తించాడు పినాకి. ''చెప్తా'' అని వెల్లడిస్తుంటే, కుటుంబ విచ్ఛిత్తీ, అంతఃకలహాలూ, తిరుగుబాట్లూ, కష్టనష్టాలూ, యిన్నిటిని భరిస్తూ తట్టుకుంటూ నిలబడి చేయూత యిస్తూ వస్తే, మిగిలిందేమిటీ అంటే, దెప్పటం, సూటీపోటీ మాటలూ, నిందలూ, నిష్ఠూరాలూ, చెప్పినట్లూ విన్నారా వింటున్నారా అంటే లేదు, బాగుపడ్డారా అంటే అదీ లేదు'' అంటుంటే బైరాగి అజ్ఞానిని చూస్తే వచ్చే, వినోదంతో కలిసిన నవ్వు దాస్తూ అన్నాడు.

''నేనంటూనే వచ్చాను మిత్రమా. చెలగాటమాడుతున్నావు అని నీవు గ్రహించకపోగా నన్ను వెర్రివాడిననుకుని'' మధ్యలో తుంచేస్తూ పరంధామ్, ''దేనితో చెలగాటమాడానంటావు? లేదే? నాకలా అనిపించలేదు. డబ్బు మంచి నీళ్లలాగా వాడుతున్నాను, పారేస్తున్నా గదా అనుకున్నాను. పోనీ యిపుడు చెప్పు''

అన్నాడు.

''నీకు తెలియుదా? నీకంతరాత్మ లేదా? అది చెప్పి వుండాలే? వినిపించుకోలేదేమో నువ్వు. మిఠాయి, కరెన్సీ చూపుతూ, అధర్మానికి మలామా చేసి ధర్మమే నన్నావు. తీరా ఆ స్త్రీ బహుశా ముందు మోహానికి చిక్కి, భ్రమకు లోనై, దరిద్రం వదిలిపోతున్నదనుకుని ప్రమాదంలోకి నడిచి రిప్రొడక్షన్ చెప్పింది నీకు. నీవు డబ్బు పారేస్తున్నా గదా అని పకపకా నవ్వి, గూళ్లెగరేసుకుంటూ పోయి పేరెన్నికగన్న ఎబార్షనిస్టుని సంప్రదించి, ''పెద్ద చదువు చదివి పెద్ద వుద్యోగం చేయాలని ఆశ'' అంటే నిజమే ననుకున్నా. తెలివిగలది అని స్నేహం చేసి తీరా చూస్తే జనాభా పెంచబూనింది. వుద్యోగస్తురాలయాక ఎడాప్ట్ చేసుకోవచ్చునే లేదా పిల్లల నర్సింగ్ హోమ్, శిశు విహార్ నడపచ్చు. నే పెట్టుబడి పెట్టేవాడిని అని హేలనగా నవ్వుతూ '' ఎడ్మిట్ చేస్తా. మీరు చూడండి తక్కిన పని. నాకు పని వున్నది. యూరప్ వెళ్లాలి. ఆమె చదువాగిపోరాదు'' అని అరేంజ్ చేసి అడ్మిట్ చేసి వెళ్లావు. సున్నితమైన మనస్సుకి సమ్మెట పోట్లు తగిలినా, దారీ తెన్నూ గానక బింకంగా నవ్వుతూ ఆ స్త్రీ ఎబార్షనిస్టుతో అన్నది. '' ఆయన తీరే అంతండీ. నేనే గమనించలేదు''.

క్లబ్ సెక్రటరీగా వున్నప్పుడు సాయంకాలం అయిదున్నరకి వెంటబెట్టుకెళ్లారు. వరండాలో నిలబడి చూస్తే రైల్వే ట్రాక్ పాసెంజరు రావటం కనబడుతుందా వేళప్పుడు. శివరాత్రికి భక్తులు వారి వూళ్లనించి రైలులో వచ్చి కోటప్ప కొండ కెళ్తారు. కొందరు రెండెడ్ల బళ్లకూ ప్రభలు కట్టి బళ్లలో వెళ్తారు కొండకు. ఆనాడు కిక్కిరిసి వున్న బోగీలను చూస్తూ నిలబడ్డాను. ''వచ్చి యేమిటి చూస్తున్నావు?''అన్నారు. రైలు పెట్టెలను చూపుతూ, బుట్టల నిండా రంగు రంగుల పూలు పోసినట్టున్నారు గదండీ?'' అన్నా. ''వాళ్లలో ఒక్కళ్లూ ఓ తల్లికీ ఓ తండ్రికీ పుట్టలేదు'' అన్నారు. నన్నే అన్నట్టు నొప్పి కలిగింది. రాయలుకి దాసీ పుత్రుడని నింద, దాసీ పుత్రునాశ్రయించటమేమిటని గ్రేట్ డాన్సర్సు వెళ్లలేదుట. కర్ణునికి సూతపుత్రుడని పేరు. తండ్రి సూర్యుడు తల్లి

క్షత్రియ స్త్రీ. నేననగా యెంత? ఇవాళ్టితో దైవమెవరి పక్షమో తేలాలి డాక్టర్. నేను సిద్ధమే'' అన్నదా స్త్రీ. ఎబార్షనిస్టుకి వయసు మళ్లింది. అనుకోకండా గర్భం దాల్చింది. భర్త అనుకూలుడు. ఆఫీసర్. రాబడి పోతుందని డ్యూటీకి తొమ్మిదో నెలవరకూ అటెండ్ అవుతున్నది. ఆ స్త్రీకి దైవమందున్న నమ్మికకు ఆశ్చర్యపోయిందా డాక్టరమ్మ'' అని చెప్తున్న మిత్రుని వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేశాడు పరంధామ్. '' ఆ ! ఇపుడర్థమైంది. ఆ మిడిలేజ్డ్ డాక్టరు పనిపాడు చేసి, చేసినట్టు నమ్మించింది నన్ను. ఇద్దరి మొహానా డబ్బు పారేసి వెళ్లానే'' అన్నాడు. దేబెలాగా కనిపించాడు పినాకికి. '' ఇప్పటికీ నువు మారలేదు మిత్రమా. అదే స్టైల్ మాట తీరు. హర్ట్ చేశాననే చింతే లేదు. నిప్పు నిప్పే. లోబడేదాకా కాళ్లూ గడ్డాలూ పట్టుకుని, బ్రైట్ ఫ్యూచర్ స్వతంత్ర జీవనం అని ఆశలు రేపి, ప్రమాదించాక, వికటించిన కలాపానికి విరుగుడుగా పుట్టలోనో, బొక్కలోనో దాచాలని ప్లాన్ అదీ కుదరక అసలుకే ఎసరు పెట్టావు. అందరివీ ప్రాణాలే. నీకే నా గౌరవ మర్యాదలూ?'' అంటున్న మిత్రుడు పరంధామ్‌కి మెత్తని పులిలాగా కనిపించాడు.

''నాకు ద్రోహ బుద్ధి లేదే'' అన్నాడర్థం గానట్టు చూస్తూ.

''నవ్వులల్లా నువ్వులైంది. ఇంకా మోటుగా అంటే తుళ్లులైంది. తెలిసిరాలేదింకా. కూడారానీక యెవరికో తోక పీకుడుగా పంపావు. చమ్చాగిరీ నేర్పావు. తైనాతీలాగా వుంచావు. ముఖ్యమైన వాటికి యెగనామం పెట్టటమే గాక జెలసీ పెరుగుతున్నా తెలుసుకోక, ''యెవరితో పోవోకు. టూమెనీ స్నేహాలు, టూ మచ్‌గా పూసుకు తిరగటం. వచ్చిన పేరు చాలు. నీకెవరూ యేమీ చేయరు. నేనే గతి'' అనే అదుపుగాక చూస్కో నా తడాఖా అని సవితిని గూడా తెచ్చి జతకట్టావు. తల్లీ బంధువులూ నిలదీస్తే'', వాళ్లిద్దరూ సఖ్యంగా వుంటామంటుంటే మధ్య మీకెందుకు బాధ'' అని గూళ్లెగరేసి నవ్వుతుంటే, తల్లికి గుండెలు భగ్గుమన్నాయి. '' ఇద్దరికీ యింత పిండం బడేస్తావంతేనా? భోగభాగ్యాలు గౌరవ మర్యాదలూ, ఆచార వ్యవహారాలూ, అపేక్షలూ,

అంతఃకరణలూ ఆత్మీయులకే పరంధామ్. తుఫాను చూస్తావు సుమా ఆనాడూ గూళ్లెగరేసి ఇహిహీ అంటావా? నీ చిత్తమొచ్చినట్లు చెలగాటమాడుతూ, తప్పులు యితరుల మీదికి నెట్టుతూ వెళ్తే అవి తెలివితేటలేమో గాని ధర్మం గాదు'' అని రోదిస్తూ వెళ్లిపోయిందా స్త్రీ తల్లి.

''మేధస్సు భక్తిగాదు అన్నారు వేదాంతులు. యోగీ యెద్దుకు పాలు పిండి మహిమ చూపితే భగవంతుని చూపినట్టేనా కాదు. అది మోసగించటమే! అన్నదో భక్తురాలు డీలా పడిపోయావేం? ఇవాళా బెణుకులు, చమత్కారం, ఆరోగెన్సు బుర్రలోకి రావటం లేదూ? ఇన్ని కంతులు కోశా గాని నాకంతి అంత నెప్పి దేనికీ లేదన్నాడట వైద్యుడు''.

'' ఇంత శిక్షా?'' అన్నాడు విసుగ్గా.

''తూనీగలో చీపురుపుల్ల దూర్చి వినోదించిన బాలునికి కౌరుత అనే శిక్ష పడేయించాడు యమధర్మరాజు''.

ఒక ప్యూన్ వచ్చి నిలబడి, ''సార్! ఫాక్స్ మెసేజ్ వచ్చింది. మెషీన్ వద్ద వుండే నారాయణరావు గారు తీసి మీ కిచ్చి రమ్మన్నారు'' అని ఒక కవరందించి వెళ్లాడు.

వూడదీసి చదివాడు బైరాగి. మెసేజ్ చిన్నదే.

''కుంతల మరణశయ్య మీదున్నది.బైరాగీ! బైరాగి బాబాయ్! అని కలవరిస్తున్నది. కోమా గూడా వస్తున్నది. కళ్లు తెరవదు. వీలుంటే వస్తావని ఆశిస్తున్నాము''. సంతకం శీతల్. చిరునామా క్లియర్‌గా వున్నది.

బైరాగి కనబడేట్టు పట్టుకున్నా మెసేజ్‌ని పరంధామూ చదివాడు.

''కుంతల యెవరు?'' అనడిగాడు.

''చెంచలి అయి సైకో అయి చెలగాటమాడిన ప్రాణి''.

ప్రయాణానికి సిద్ధమైన బైరాగితో ''నేనూ వస్తాను. వయస్సెంతుంటుంది సుమారుగా'' అని అన్నాడు.

''తప్పకుండా రా మిత్రమా. నో అబ్జెక్షన్'' అని చేతి సంచీ అందుకుని వాచ్‌మన్ని పిలిచి అంతా చెప్పి మెసేజ్ చూపాడు. శలవు చీటీ రాసి, వారం రోజులకి వచ్చేస్తాను అని సంతకం చేసి కవర్లో వుంచి అందించాడు. సహవుపాధ్యాయులను కలుసుకుని ''మానేజ్‌మెంట్ మీరు చూడండి నమస్తే'' అన్నాడు.

గేటు దాటగానే పరంధామ్‌తో అన్నాడు ''షష్ట్యబ్ది అయింది కుంతలకు''.

4

బైరాగి గొంతు వినబడగానే, తనపేరు వినబడగానే తమాషాగా కుంతల కళ్లు విప్పింది. నవ్వింది. తెల్లని పాపలూ, తళ తళ లాడుతున్న కనుపాపలు. మొహం తేటగా వున్నది. దయ్యపు చూపు లేదు. తీర్చినట్టున్న కనుబొమలు. సంపెంగ రెక్కలాంటి ముక్కు అందాలొలికే పెదవులూ మూతీ, కోల మొహం. అందమైన చుబుకం. ప్రయత్నించి రెండు చేతులూ కలిపి దణ్ణం పెట్టింది. కంఠం వరకూ తెల్లని చీర కప్పి వున్నది.

''వచ్చావే బైరాగీ! థాంక్స్. రావచ్చావా అనుకున్నా. వచ్చి వింటున్నట్టు కలగంటున్నా. కలగాదేమో. నిజమేనేమో గ్రహింపుకి రావటం లేదు బైరాగీ. నువ్వన్నది నిజమే బైరాగీ నా జీవితంతోనే గాక యితరుల జీవితాలతోనూ చెలగాటమాడాను. వింత యేమనగా తెలుస్తూనే వున్నది, చెప్తూనే వచ్చావు గెలవనని. కాని జబ్బుని గెలవలేకపోయాను. అదీ చెప్పావు బైరాగీ, ''జబ్బు పడ్డా అలాగే రోజులు గడిపేయక్కర్లేదు. కుంతలా. దైవాన్ని నమ్మి నయం చేసుకోవచ్చు. ఘనవైద్యుడు దైవం, వైద్యనాథ్ తప్పక నయం చేస్తాడు.

గజేంద్రుడదే చేశాడు. మొసలిని గెలవలేనని దైవాన్ని ఆశ్రయించాడు. నిన్నూ దురాశ మానసిక వ్యాధి రూపంలో పట్టుకున్నది. దాన్ని గెలవాలి'' అన్నావు బైరాగి. చెవిటివాని ముందు శంఖం వూదినట్లయింది బైరాగీ. సుధాని దాని నుండీ విడదీయాలనీ, నా దాసుని చేసుకోవాలనీ, నా తడాఖా చూపాలని చివరికి చంపాలని గూడా ఆలోచన వచ్చింది బైరాగీ అది చెలగాటమే. నువ్వు చెప్తున్నా,

నాకే తెలుస్తున్నా, రోగానికే లొంగాను. సుధా చేరదీసి దానికే, తగినంత గౌరవమూ, అధికారమూ, వాని దగ్గర చనువు లేవు. నా కెందుకిస్తాడని తెలుస్తున్నా, దేని వెంట పరుగెత్తుతున్నానో నువ్వు చెప్తున్నా రోగ చర్య అను లేదా జాతకరీత్యా అన్నా బాగుంటుంది, విన బుద్ధి గాలేదు. తీరా చిత్తుగా ఓడాక నీ మాటలూ గుర్తు వచ్చాయి. నువ్వు గుర్తొచ్చావు బైరాగీ. నిన్ను చూసి నిర్విచారంగా పోవాలని పిలిచి, తలుచుకుంటుంటే, వ్యాస మహర్షి సత్యవతి దేవి తలుచుకోగానే వచ్చినట్లు వచ్చి వూరట కల్గించావు బైరాగీ. నమస్తే నీ తీయని గొంతుతో భక్తి గీత మొకటి పాడు వింటూ పోతాను'' అన్నది. బైరాగీ పరంధామ్ కుర్చీల్లో పక్కనే వున్నారు. బైరాగి కుంతల తల నిమురుతూ పాడసాగాడు.

''ప్రభు మేరెదిల్ మెసదాయాద్ ఆనా।
దయాకర్‌కె దరిశన్ తూముఝుకో దిఖానా ॥ప్రభు॥
సదా కామకోయీనతేర ఖుషీకా।
ముఝే దీనబంధూ నదిలొసే చుడానా ॥ప్రభు॥
సదా జాన్‌కర్ దాస్ అప్‌నే చరణ్‌కా

అని తీయగా పాడుతున్న బైరాగికి చేతులెత్తి తన తల కానించుకున్న కుంతల చేతులు దైవానికి నమస్తే చెపుతున్నట్టున్నాయి. అంతలోనే జారిపోయాయి. ఆలి చిప్పల్లాంటి కనురెప్పలు మూతబడినాయి. కుంతల తల నిమురుతున్న బైరాగి చేతులు యువతలికి వచ్చాయి. అప్రయత్నంగా అతని కళ్లు తడిశాయి. సింపథిటిగ్గా వింటూ చూస్తున్న మిత్రుడు పరంధామ్ కళ్లూ తడిశాయి.